సాక్షి విశాఖపట్నం

శనివారం, 13, మే, 2023



స్పందన ఫిర్యాదులపై చర్యలు

స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. IIలో



దైవ బలం.. దాతల సహకారం

కోన అప్పలరాజు ఇప్పటివరకు ఉమ్మడి విశాఖ జిల్లా, ఒడిశాలో 610 ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్టించారు. IIలో



నైపుణ్యాభివృద్ధి ముఖ్యం

నైపుణ్యాభివృద్ధి ముఖ్యమని ఐఎస్‌హెచ్ఆర్ఏఈ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ యు.సి.ఎం పట్నాయక్ అన్నారు. IIలో

న్యూస్‌రీల్

సీ హారియర్ సందర్శనకు సిద్ధం

దొండపర్తి (విశాఖ దక్షిణ): సీ హారియర్ మ్యూజియం సందర్శనకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ మ్యూజియం ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో పర్యాటకుల సందర్శనకు వీఎంఆర్‌డీఏ ఈ మ్యూజియాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు, అలాగే ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8.30 వరకు సందర్శకులను అనుమతించనున్నారు. పిల్లలకు రూ.40, పెద్దలకు రూ.70, వీడియో కెమెరాతో వెళ్లే వారికి రూ.200గా టికెట్ ధరను నిర్ణయించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

దొండపర్తి(విశాఖ దక్షిణ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ శనివారం విశాఖకు రానున్నారు. మధ్యాహ్నం 3.05కు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 4.10కి విశాఖకు చేరుకొని ప్రభుత్వ అతిథి గృహంలో రాత్రి చేస్తారు. ఆదివారం ఉదయం 10.30కి రోడ్డు మార్గంలో విజయనగరం బయలుదేరి అక్కడ వివాహ రిసెప్షన్‌కు హాజరై తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు పయనమవుతారు.

రేపు విశాఖకు డిఫెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ..

డిఫెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం ఆదివారం విశాఖకు రానుంది. కమిటీ చైర్మన్ జువల్ ఓరమ్ నేతృత్వంలో 19 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులు నగరంలో ట్రాన్సిట్ హాల్ట్ చేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.30కి రోడ్డు మార్గంలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలో సునాబేడకు పయనమవుతారు.

17న వెంకయ్యనాయుడు రాక

దొండపర్తి(విశాఖ దక్షిణ): మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 17వ తేదిన విశాఖకు రానున్నారు. ఆ రోజు ఉదయం 7.50కి హైదరాబాద్‌నుంచి విమానంలో బయలుదేరి ఉదయం 8.50కి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 18న ఉదయం 11 గంటలకు వాల్తేరు క్లబ్‌లో జరిగే ఇమ్మని విష్ణురావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 19వ తేదీ కూడా పోర్టు అతిథి గృహంలోనే బస చేసి 20వ తేదీన ఉదయం 7 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు పయనమవుతారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్టు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కొత్తలంక సుధ (టెక్నికల్) తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ (హైదరాబాద్), వింధ్యా-ఇన్ఫో మీడియా (బెంగళూరు), హిరావత్స్ (విశాఖ), అస్ లిమిటెడ్ షాపింగ్ మాల్, పెగాసిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ (హైదరాబాద్, వినిస్, కేఎఫ్‌సీ, పాల్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరింగ్, బిగ్ బాస్కెట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్, బిగ్ సి మొబైల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో దివ్యాంగులకు, సాధారణ అభ్యర్థుల కోసం 312 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల్లో 175 మంది పాల్గొన్నారు. దివ్యాంగులు, సాధారణ అభ్యర్థులు 95 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఆయా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ వార్షిక పరీక్షలు ప్రారంభం

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సి-20సిలబస్‌కు సంబంధించి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో 99శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకు నిర్వహిస్తారు. ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పర్యవేక్షించారు. సి-20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతో పాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం పరీక్ష 9.30గంటల నుంచి 12.30గంటలకు, మధ్యాహ్నం పరీక్ష 2.00గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించారు.

తొలి వెలుగుకు జేజేలు

- మొదటి విద్యుత్ బల్బు వెలిగింది పాతనగరంలోనే..
- జనరేటర్ సాయంతో కరెంట్ సరఫరా మొదలు పెట్టిన సెయింట్ అలోసియస్
- 1908 మే 13న విశాఖలో కరెంట్‌తో యంత్రాల పనితీరు ప్రారంభం



పోర్టులో అప్పట్లో ఏర్పాటు చేసిన పవర్ హౌస్



తొలి విద్యుత్ బల్బు వెలిగింది ఇక్కడే...

సాక్షి, విశాఖపట్నం : చీకటి బస్తీగా ఉన్న విశాఖకు.. విద్యుత్ వెలుగులు ఎప్పుడొచ్చాయి.? ఈ ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది కదా.? నిజమే.. నగరంలో కరెంట్ బల్బు ఎప్పుడు వెలిగిందో తెలుసా..? ఈ రోజుకు సరిగ్గా 115 ఏళ్లు గడిచాయి. అయితే.. ఇందులో ఉన్న ట్విస్ట్ ఏంటంటే.. తొలి విద్యుత్ బల్బు వెలిగింది కరెంట్ కనెక్షన్‌తో కాదు. జనరేటర్ ద్వారా.. అది కూడా.. ఈ మహానగరంలో పాతబస్తీగా చెప్పుకునే వన్‌టౌన్ ఏరియాలో. విశాఖలో విద్యుత్ బల్బు వెలిగిన నేపథ్యం గురించి.. మరిన్ని వివరాలు తెలుసుకోవాలని ఉందా.. అయితే ఈ స్టోరీ చదివేయండి..

ప్రస్తుతం ఉన్న వన్‌టౌన్ ఏరియాను అప్పట్లో పాతనగరంగా పిలిచేవారు. అక్కడ సెయింట్ అలోసిసియస్ టెక్నికల్ స్కూల్ అని ఉండేది. ఈ ఇండస్ట్రియల్ స్కూల్‌లో.. పాత తరం నాటి కార్లు, యంత్రాలు బాగుచేసేవారు. అయితే పని వేగాన్ని పెంచుకునేందుకు, రాత్రి సమయంలో కూడా ఈ యాజమాన్యం జనరేటర్లను తీసుకొచ్చింది. అప్పటికింకా నగరంలో విద్యుత్ వినియోగం ప్రారంభం కాలేదు. ఆ సమయంలో ఇతర దేశాల నుంచి జనరేటర్ తీసుకొచ్చి సెయింట్ అలోసియస్ స్కూల్ కొత్త బిల్డింగ్‌లో 1908 మే 13న విద్యుత్ బల్బులను వెలిగించారు. ఈ విద్యుత్ వెలుగులను చూసేందుకు విశాఖ ప్రజలు ప్రత్యేకంగా వెళ్లేవారని మద్రాస్ మెయిల్‌లో 1908లోనే పొందుపరిచారు. సెయింట్ అలోసియస్ స్కూల్ 175 ఏళ్ల వేడుకలు ఇటీవల జరిగిన నేపథ్యంలో ఆ పాఠశాల పూర్వ విద్యార్థి జాన్ కాస్టెల్లాస్ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు.

కేజీహెచ్‌లో పవర్ హౌస్‌లు..

ఆ తర్వాత వాల్తేరు క్లబ్‌కు రెండు డీజిల్ జనరేటర్లను తీసుకొచ్చి క్లబ్‌లో 1912 నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. 1915లో సెయింట్ పాల్స్ చర్చికి ఎలక్ట్రిక్ ఇన్‌స్టాలేషన్ వచ్చింది. పాత కొవ్వొత్తుల స్థానంలో ఎలక్ట్రికల్ బల్బులు, ఫ్యాన్లు అమర్చారు. ఈ విద్యుత్ సరఫరాకు అయిన ఖర్చు మొత్తం చర్చి సభ్యులు చందాలు వేసుకుంటూ భరించారు. ఇక 1923లో కేజీహెచ్ హాస్పిటల్‌లో విద్యుత్ సరఫరా మొదలైంది. ఇందుకోసం పవర్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత మరో పవర్ హౌస్ ఏర్పాటు చేశారు.

ప్రజల కోసం పోర్టులో థర్మల్ ప్రాజెక్టు

అప్పటి వరకూ వివిధ సంస్థలకు మాత్రమే విద్యుత్ సరఫరా వచ్చిన నేపథ్యంలో ప్రజల కోసం కరెంట్‌ను అందించేందుకు విశాఖపట్నం పోర్టులో చర్యలు చేపట్టారు. తొలుత పోర్టు నిర్మాణ సమయంలో సొంత వినియోగానికి థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకోగా క్రమంగా రెండు జనరేటర్ల సాయంతో 300 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో పవర్ ప్రాజెక్టును నడిపించారు. మునిసిపల్ లైటింగ్ అథారిటీకి, బెంగాల్, నాగ్‌పూర్ రైల్వేకి పెద్ద మొత్తంలో విద్యుత్‌ను విశాఖ పోర్టు నుంచే సరఫరా చేయాలని ప్రతిపాదించారు. ఓడరేవు నిర్మాణం పూర్తయ్యే సమయానికి ఈ పవర్‌హౌస్ నుంచి విద్యుత్‌ని మున్సిపల్ అధికారులకు అందించాలనే ప్రతిపాదన కూడా తీసుకొచ్చారు. ఆ సమయంలో పోర్టు, రైల్వే, ప్రభుత్వ నిర్మాణ పనులు చేపడుతున్న అప్పటి ఇంజినీర్ దంతులూరి లక్ష్మీ నరసింహరాజు ఆంధ్రా ఇంజినీరింగ్ అండ్ కోసం పేరుతో ప్రభుత్వం నుంచి 1910 విద్యుత్ చట్ట ప్రకారం 1933లో పవర్ హౌస్ కోసం లైసెన్స్ తీసుకొచ్చారు. పోర్టు నుంచి విశాఖ నగరానికి విద్యుత్ సరఫరాకు లైన్ క్లియర్ అయ్యింది.

1938 నుంచి పూర్తి సరఫరా మొదలు..

విజగపట్నం ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్ (వెస్కో) పేరుతో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించారు. ఇది ప్రస్తుతం ఉన్న డిస్కమ్‌లతో సమానమని చరిత్ర చెబుతోంది. ఆంధ్రా జిల్లాల విద్యుత్ అవసరాలపై అధ్యయనం చేసిన మద్రాసు ప్రభుత్వం విశాఖపట్నం నగర అవసరాల్ని తీర్చేందుకు లంబసింగిలో హైడ్రో ఎలక్ట్రిక్ స్కీమ్ కోసం 1935-36 కాలంలో అధ్యయనం చేసి రూ.18.70 లక్షలు మంజూరు చేసింది. పోర్ట్ పవర్ హౌస్‌ను మద్రాసు ప్రభుత్వం కొనుగోలు చేసి.. మరో థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని పోర్టు ఏరియాలోనే ప్రారంభించింది. 1938 మార్చి 26 ఈ ప్లాంట్ అమల్లోకి రాగా.. రెండు పవర్ స్టేషన్లతో విశాఖపట్నం నగరానికి 1938లో విద్యుత్ సరఫరా మొదలైంది. ప్రస్తుతం ఈ విద్యుత్ సరఫరాని విశాఖకు ఏపీఈపీడీసీఎల్ నుంచి అందుతోంది.

బాంబు దాడిలో పవర్ హౌస్ ధ్వంసం

విజ్జేశ్వరపు ఎడ్వర్డ్ పాల్, చరిత్రకారుడు



రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖపట్నం పోర్టుపై 1942 ఏప్రిల్ 6న జపాన్ విమానాలు బాంబుదాడులు చేశాయి. ఈ దాడుల్లో పోర్టు పవర్ హౌస్ ధ్వంసం కావడంతో ఆ రాత్రి నగరంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. 1952లో వెస్కో బాధ్యతను మద్రాసు ప్రభుత్వం తీసుకుంది. వెస్కో ఆస్తులన్నింటినీ విద్యుత్ అండర్‌టేకింగ్ అక్విజిషన్ యాక్ట్ ప్రకారం స్వాధీనం చేసుకోవడంతో.. విశాఖకు వెస్కో అందించిన కరెంట్ కార్యకలాపాలకు తెరపడింది. 1966లో థర్మల్ పవర్ స్టేషన్లను మూసివేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పోర్టులో ఏర్పాటు చేసిన పవర్ స్టేషన్ పాత్ర కూడా ముగిసింది. నానాటికి నగరంలో పెరుగుతున్న డిమాండ్లకు అనుగుణంగా.. ఏపీఈపీడీసీఎల్ సరికొత్త వ్యవస్థతో విశాఖకు నిరంతరాయంగా విద్యుత్‌ని సరఫరా చేస్తోంది.

ముగ్గురు సీఐలపై వేటు

- ఆరోపణల నేపథ్యంలో రేంజ్‌కు సరెండర్
- సీఎస్‌బీ-2 సీఐ ధనుంజయనాయుడు, మల్కాపురం సీఐ లూథర్‌బాబు, హార్బర్ సీఐ శోభన్‌బాబు
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ త్రివిక్రమ్
- త్వరలో మరికొందరిపై చర్యలు?





సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): నగర పోలీస్ శాఖలో ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలకు రంగం సిద్ధమైంది. తొలుతగా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లపై వేటు పడింది. ఏడాది కాలంగా పోలీస్ శాఖలో షాడో కమిషనర్‌గా చక్రం తిప్పిన సిటీ స్పెషల్ బ్రాంచ్-2 సీఐ సి.హెచ్.ధనుంజయ నాయుడుతో పాటు మల్కాపురం సీఐ బి.లూథర్‌బాబు, హార్బర్ సీఐ పి.శోభన్‌బాబులను విశాఖ రేంజ్‌కు సరెండ్ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఊహించినట్టుగానే వేటు..

పోలీస్ శాఖలో సీఐ ధనుంజనాయుడు ఏడాది పాటు ఒక వెలుగు వెలిగారు. షాడో కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారన్న టాక్ నడిచింది. కమిషనరేట్ పరిధిలో ఎవరికి ఏ పని అవసరమైనా, ఎక్కడ పోస్టింగ్ కావాలన్నా అతడిని సంప్రదిస్తే అయిపోతుందన్న ఆరోపణలు గట్టిగా వినిపించాయి. కొన్ని బదిలీల విషయంలో రూ.లక్షలు వసూలు చేశారన్న వార్తలు గుప్పుమన్నాయి. బహిరంగంగానే పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ వాదనలకు మరింత బలం చేకూరినట్టయింది. అయితే కొత్త కమిషనర్ వచ్చిన కొద్ది రోజుల్లోనే తొలి వికెట్ ధనుంజయనాయుడే అని పోలీస్ శాఖలో ఏ ఇద్దరు కలిసినా చెవులు కొరుక్కుంటూనే ఉన్నారు. కమిషనరేట్‌లో గుసగుసలకు తగ్గట్టుగానే ప్రక్షాళన ఆయన నుంచే ప్రారంభమైనట్లు ఈ వేటుతో స్పష్టమవుతోంది. ఆయనతో పాటు అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారన్న ఆరోపణలపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు, హార్బర్ సీఐ, కోర్టు లైజన్ ఆఫీసర్ పి.శోభన్‌బాబులపై వేటు పడినట్టు తెలుస్తోంది.

పోలీసు శాఖలో గుబులు : పోలీస్ కమిషనర్ సీఎం.త్రివిక్రమ్ వర్మ ప్రక్షాళనలకు పూనుకోవడంతో పోలీస్ శాఖలో గుబులు మొదలైంది. నిన్న మొన్నటి వరకు పైవాళ్ల ఆశీర్వాదాలు ఉన్నాయన్న ధీమాతో రెచ్చిపోయిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ కీలక స్టేషన్లలో పోస్టింగ్‌లు సాధించిన వారిలో అలజడి రేగుతోంది. తరువాత ఎవరిపై వేటు పడనుందో నన్న భయం పట్టుకుంది.

త్వరలో మరికొంత మందిపై వేటు?

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొంత మంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల తీరు పట్ల అనేక ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. ఒకవైపు అవినీతి ఆరోపణలతో పాటు మరోవైపు కేసుల నమోదు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. కొన్ని కేసుల విషయంలో ఫిర్యాదుదారులపైనే బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. కేసుల నమోదు సంఖ్య విషయంలో కూడా తప్పుడు లెక్కలు చూపించినట్టు ఉన్నతాధికారులు ఆలస్యంగా గ్రహించి కొద్ది నెలల క్రితం మూడు స్టేషన్ల సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా నగరంలో జరిగిన భారీ కార్యక్రమాలు వీవీఐపీ, వీఐపీ పర్యటనల విషయంలో పోలీసుల ఓవర్ యాక్షన్‌పై విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వీటన్నింటిపై పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఇప్పటికే దృష్టి సారించినట్లు సమాచారం. పోలీస్ శాఖలో సమూల ప్రక్షాళన దిశగా చర్యలు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సీఐలు, ఎస్ఐలపై దృష్టి పెట్టినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇటువంటి వారి జాబితాను సిద్ధం చేసి దశల వారీగా ఒక్కొక్కరిపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

క్రమశిక్షణతో ఎదిగిన నేత మేరుగు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి మేరుగు నాగార్జున, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

- ఏయూతో ఎంతో అనుబంధం
- ఘనంగా సత్కరించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



నాగార్జునను సత్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, నారాయణస్వామి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జునను ఆంధ్రవిశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించింది. ఏయూ పూర్వ ఆచార్యుడైన మేరుగు నాగార్జున మంత్రిగా ఉన్న నేపథ్యంలో ఏయూ యంత్రాంగం ఆయనను ఘనంగా సత్కరించింది. ఏయూ అంబేడ్కర్ అసంబ్లీ హాల్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించగా టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏయూ వారసత్వం ఉన్న వ్యక్తి అయినందునే ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. ఇక్కడ క్రమశిక్షణ, బోధన అనుభవం ఆయనను మంచి రాజకీయ నాయకుడిగా తీర్చిదిద్దాయన్నారు. గతంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సమర్థవంతంమైన సేవలు అందించిన నాగార్జున ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధిని ఆయన ప్రశంసించారు. ఆ-హబ్, ఇన్నోవేషన్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలకు, ఉన్న ప్రమాణాలకు బాటలు వేస్తూ వీసీ ప్రసాదరెడ్డి వర్సిటీకి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌లు మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నాగార్జున నిత్యం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రానికి, దళిత సామాజిక వర్గానికి ఆయన మరిన్ని ఉన్నత సేవలు అందించాలన్నారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూ విద్యార్థిగా, పరిశోధకుడిగా, ఆచార్యుడిగా, రాజకీయ వేత్తగా మంత్రి నాగార్జున ఎదిగిన తీరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక స్ఫూర్తికి, చైతన్యానికి నిదర్శమన్నారు. సన్మాన గ్రహీత మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం నేర్పిన క్రమశిక్షణే తనను ఈ స్థాయికి చేర్చిందన్నారు.

తన రాజకీయ ఎదుగుదలలో వైఎస్సార్ కుటుంబం అందించిన ప్రోత్సాహం వెలకట్టలేనిదని కొనియాడారు. అనంతరం అతిథులు మేరుగు నాగార్జునను ఘనంగా సత్కరించారు. ప్రజా, ఉద్యోగ, న్యాయ, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గొల్లబాబూరావు, అదీప్‌రాజు, మాజీ వీసీ బాలమోహన్‌దాస్, ఆచార్య నరసింహారావు, ఆచార్య ధనుంజయరావు, ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య పుల్లారావు, ఆచార్య షారోను రాజు, వర్సిటీ ప్రస్తుత, పూర్వ ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

16 నుంచి సంస్కృత సంభాషణ శిబిరం

దాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 25వరకు నగరంలోని విశాఖ సేవా సదన్ స్కూల్లో సంస్కృత సంభాషణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్కృత భారతి జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తెలిపారు. దేశ వ్యాప్తంగా సంస్కృతాన్ని ప్రాచుర్యం చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దశదిన శిబిరం రామ్‌నగర్‌లో గల విశాఖ సేవా సదన్ స్కూల్లో నిర్వహించనున్నట్టు చెప్పారు. వయసుతో సంబంధం లేదని, ఆసక్తి గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9866182834 నంబరులో సంప్రదించవచ్చు.

ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెరిగింది

- చక్కటి ప్రణాళికతోనే అత్యుత్తమ ఫలితాలు
- టెన్త్ టాపర్లు 63 మందికి ఘన సన్మానం
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్
- ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలకు రూ.50వేలు చొప్పున ప్రోత్సాహం
- కలెక్టర్ మల్లికార్జున



టెన్త్ టాపర్‌లతో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, డీఈవో చంద్రకళ, ఇతర అధికారులు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: ప్రణాళిక బద్ధంగా పాఠశాలల్లో విద్యాబోధన చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చునని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో 570 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు కలెక్టర్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 63 మంది విద్యార్థులు 570 పైగా మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో జిల్లాను 3వ స్థానంలో నిలుపడం అభినందనీయమన్నారు. గత ఏడాది విశాఖ జిల్లా 5వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది అధిగమించడం విద్యాశాఖ సమన్వయ కృషి ఫలితమేనన్నారు. విద్యార్థులు మంచి ఫలితాల సాధనలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. నిరుపేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు అభ్యసించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో తీసుకువచ్చే మార్పులతో గొప్ప ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు.

టాప్-2లో చోటు దక్కాలి

వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి రెండు స్థానాల్లో విశాఖ జిల్లా చోటు దక్కించుకునేలా చక్కటి ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచించారు. తక్కువ ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలల్లో ఎందుకలా జరిగిందనేది సమీక్షించుకోవాలన్నారు. వెనుకబడ్డ చివరి 25 పాఠశాలలకు రూ.50 వేలు చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదే రీతిన టాప్‌లో నిలిచిన స్కూళ్లకు కూడా ప్రోత్సాహక నిధులు ఇస్తామన్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని డీఈవోను ఆదేశించారు.

వంద రోజుల ప్రణాళికను అమలు చేశాం

జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయడం ద్వారానే ఆశించిన స్థాయిలో ఫలితాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమక్షంలో విద్యార్థులకు మెడల్, మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి డాక్టర్ మల్లికార్జున, అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డీవీ.రమణమూర్తి, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసరావు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, జిల్లా లేబర్ అధికారి సునీత, డీఎస్ఓ సూర్యప్రకాష్ రావు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ఇమంది పైడిరాజు ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కలెక్టర్ కావాలన్నదే లక్ష్యం



పదో తరగతి ఫలితాల్లో 600 గాను 592 మార్కులు సాధించా. ఉపాధ్యాయుల విద్యాబోధన, తల్లిదండ్రులు ప్రోత్సాహం వల్లే తనకు మంచి మార్కులు వచ్చాయి. కలెక్టర్ కావాలనేది లక్ష్యం. ప్రభుత్వ స్కూళ్లు దేనిలోనూ తీసిపోవని ఈ ఫలితాలు చాటి చెప్పాయి.

– పి. మణికంఠ, మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



పదో తరగతి ఫలితాల్లో 600 గాను 585 మార్కులు వచ్చాయి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు-నేడు, అమ్మఒడి పథకాల ద్వారా స్కూళ్లలో కల్పించిన వసతులు, విద్యాబోధనతోనే మంచి మార్కులు వచ్చాయి. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఇ.రేవతి, ఆనందపురం కేజీబీవీ పాఠశాల

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ పీవీ సురేష్‌పై వేటు

89వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ కూడా..

దొండపర్తి (విశాఖ దక్షిణ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ పరిధిలో 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అతనితో పాటు 89వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డి కిరణ్‌పై కూడా వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

జూన్ నాటికి ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్

రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్



ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న రవాణా కమిషనర్ మనీష్‌కుమార్

గోపాలపట్నం: ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ సెంటర్‌ను త్వరగతిన పూర్తి చేయాలని రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా ఆదేశించారు. శుక్రవారం ఆయన గంభీరంలో నిర్మాణంలో ఉన్న ఫిట్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. అలాగే ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ఈ పనులు జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఆర్థిక లక్ష్యాలను సాధించాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ఆయనతో పాటు రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ వి. సుందర్, ఉప రవాణా కమిషనర్ సీజీ రాజారత్నం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండె పోటుతో ఏఎస్ఐ మృతి


వాసుదేవరావు(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న జాగరపు వాసుదేవ రావు(61) షీలానగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం గుండె పోటుతో మరణించారు. 1983 బ్యాచ్‌కు చెందిన వాసుదేవరావు వివిధ స్టేషన్లలో పలు హోదాల్లో విధులు నిర్వర్తించారు. నీతి, నిజాయతీ, క్రమశిక్షణ గల ఉద్యోగిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందని తోటి సిబ్బంది తెలిపారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న వెస్ట్‌జోన్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, అధికారి ఎం.డి.ప్రసాద్, సిబ్బంది ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

గంజాయి తరలించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గంజాయి కేసులో మరో వ్యక్తి ఫోర్త్‌టౌన్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ నెల 9న ఏజెన్సీ ప్రాంతం నుంచి కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారంతో దాడులు చేశారు. శ్యామ్‌దాస్, అవినాష్‌లను అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ కేసుకు సంబంధించి మరో వ్యక్తి తప్పించుకున్నాడు. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పరారైన మూడో వ్యక్తి అగస్టీన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌కు చెందిన తేజ(23) శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఉదయం 7 గంటల వరకు స్నేహితులతో మాట్లాడిన తేజ ఆకస్మాత్తుగా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆత్మహత్య విషయాన్ని స్థానికులు గోప్యంగా ఉంచి వెంటనే దహన సంస్కారాలు నిర్వహించారు. దీనిపై భీమిలి పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

దైవ బలం.. దాతల సహకారం

- నిర్విఘ్నంగా ఆంజనేయ విగ్రహ యజ్ఞం
- సహస్ర విగ్రహాల స్థాపనే లక్ష్యం
- భక్తిభావం పెంపొందిస్తున్న సద్గురు సేవాశ్రమం


యోగారాజు ప్రతిష్ఠించిన విగ్రహం


భీమిలిలోని సద్గురు సేవాశ్రమం


విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మన్యం ప్రజలతో యోగారాజు(పాతచిత్రం)

తగరపువలస: ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు జీవీఎంసీ 3వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం నిర్వాహకుడు కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు తనవంతు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు ఉమ్మడి విశాఖ జిల్లా, ఒడిశాలో 610 ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించారు.

వెయ్యి విగ్రహాలను ప్రతిష్టిస్తాం



ఆంజనేయ స్వామి విగ్రహాల ఏర్పాటుకు మన్యంలోని వివిధ గ్రామాల నుంచి రోజూ ప్రతిపాదనలు వస్తున్నాయి. ఒక్క విగ్రహం మాత్రమే అనుకుని ప్రారంభమైన ఈ దీక్ష హనుమాన్ శక్తి తోడుతో.. 610 విగ్రహాలకు చేరింది. దైవబలం, దాతల సహకారం లభిస్తుండటంతో వెయ్యి విగ్రహాల మైలురాయిని చేరుకుంటాం. విగ్రహాలు అవసరమైన మన్యం గ్రామాల ప్రజలు 98486 49067, 85005 09067 నంబర్లకు సంప్రదించవచ్చు. – యోగా రాజు, రామయోగి అగ్రహారం, భీమిలి

వీటిలో 570కు పైగా విగ్రహాలు మన్యంలోని అరకు, అనంతగిరి, చింతపల్లి, డుంబ్రిగుడ, గూడెం కొత్తవీధి, జి.మాడుగుల, హుకుంపేట, కొయ్యూరు, ముంచంగిపుట్టు, పాడేరు, పెదబయలు మండలాలతో పాటు ఒడిశాలోని కోరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో పూజలందుకుంటున్నాయి.

సహస్ర విగ్రహస్థాపనే లక్ష్యంగా..

సహస్ర విగ్రహ స్థాపనే లక్ష్యంగా దాతల అండదండలతో ఈ మహాయజ్ఞం ముందుకు సాగుతోంది. ఈ నెల 13న పాడేరు మండలం మినుములూరులో 610వ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేశారు. గిరిజనుల్లో భక్తిభావం సడలిపోకుండా ఆంజనేయ స్వామి విగ్రహాలు ప్రతిష్టిస్తున్నట్లు అప్పలరాజు తెలిపారు. ఆశ్రమం తరపున ప్రతిష్ఠించిన విగ్రహాల్లో 5 నుంచి 12 అడుగుల సిమెంట్ విగ్రహాలతో పాటు ఇళ్లలో పూజించుకోవడానికి, జనాభా తక్కువ గల గ్రామాలకు 12 అంగుళాల కంటే తక్కువ సైజు రాతి విగ్రహాలు అందిస్తున్నారు. మన్యంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు ఉన్న చోట 500కు పైగా ఆలయాలకు నెలకు రూ.2.25లక్షల వంతున ఏడాది పాటు రూ.27 లక్షల విలువైన పూజా సామగ్రి పంపిణీ చేశారు. విగ్రహాల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఆశ్రమం తరఫున రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఏడాది కిందట అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో రూ.50లక్షలు ఖర్చు చేసి 15 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయం నిర్మించారు. హుకుంపేట మండలం మద్దివీధి శివాలయం పునరుద్ధరణ, ములుసోబలో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

మేడపై నుంచి పడి మహిళ మృతి


శాంతి(ఫైల్)

మల్కాపురం: మేడపై నిద్రించడానికి వెళ్లిన మహిళ.. తెల్లవారే సరికి మేడ కింద మృతి చెంది ఉంది. వివరాలివీ.. జీవీఎంసీ 62వ త్రినాథ్‌పురం వద్ద వాసం శాంతి (25) తన తల్లి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. శాంతి భర్త శ్రీను సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పని చేస్తున్నాడు. అయితే వీరిద్దరి మధ్య గొడవల కారణంగా ఏడాది కిందట తన ఇద్దరి పిల్లలతో ఆమె తల్లి వద్దకు వచ్చేసింది. ఉక్కపోత కారణంగా గురువారం రాత్రి శాంతి నిద్రించడానికి మేడపైకి వచ్చింది. నిద్రలో అదుపు తప్పి కింద పడిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున ఆమె తల్లి మేడ కింద శాంతి మృతి చెంది ఉన్న విషయాన్ని గుర్తించి.. మల్కాపురం పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఆమె మృతిపై వివరాలు సేకరించారు. కాగా.. శాంతికి అక్క ఉంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె ఏడాది కిందట ప్రమాదవశాత్తూ మరణించింది. ఆమె ఇద్దరు పిల్లలు, శాంతి పిల్లలు ఒకేచోట ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలు మృతి చెందడంతో నలుగురి పిల్లల భారం వారి తల్లిపై పడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక విభాగంపై శుక్రవారం నిర్వహించిన స్పందనలో జోన్–5 నుంచి రెండు, జోన్–6 నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చింది. ప్రధాన సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్ వీరి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి.. నేరుగా సమస్య తెలపవచ్చని ప్రధాన సిటీ ప్లానర్ సూచించారు.

సాంకేతిక యుగంలో నైపుణ్యాభివృద్ధి ముఖ్యం

గోపాలపట్నం: సాంకేతిక యుగంలో నైపుణ్యాభివృద్ధి ముఖ్యమని ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ యు.సి.ఎం పట్నాయక్, ఐఈఐ చైర్మన్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్ అన్నారు. ఎన్ఎస్టీఎల్‌లో ఐఈఐ ఎన్ఎస్టీఎల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా, ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్ రిఫ్రిజిరేంటింగ్ అండ్ కండీషనర్ ఇంజినీర్స్ (ఐఎస్‌హెచ్‌ఆర్‌ఏఈ) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి జాతీయ సాంకేతిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీర్లు, శాస్త్రవేత్తల కృషి అమోఘమైందన్నారు. 1998లో పోఖ్రాన్ క్షిపణి ప్రయోగమే కాకుండా త్రిశూల్ క్షిపణి, ఎయిర్ క్రాఫ్ట్ హంసా–3, ప్రయోగాలు విజయవంతమయ్యాయని తెలిపారు. ఈ ఏడాది 'స్కూల్ టూ స్టార్టప్– ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ టు ఇన్నోవేట్'అనే థీమ్‌తో సాంకేతిక దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విశాఖలోని బాబా అటానమిక్ రీసెర్చ్ సెంటర్ లైట్ వాటర్ రియాక్టర్ హెడ్ పి.కె మిశ్రాను ఘనంగా సత్కరించారు. ఆయన భారత అణు కార్యకలాపాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఈఐఈ విశాఖపట్నం సెంటర్ గౌరవ కార్యదర్శి ఆ.నాగేశ్వరరావు, ఇష్రే విశాఖపట్నం చాప్టర్ కార్యదర్శి డి.రవీంద్రనాథ్, ఐఈఐ మాజీ చైర్మన్లు డాక్టర్ బి.వెంకటరమణ, బిందు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఆధునికీకరణ భేష్

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

మద్దిలపాలెం: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ముందుగా సుబ్బారెడ్డి ఏయూ పరిపాలన భవనం వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏయూలో చేపడుతున్న అభివృద్ధి పనులను వీసీ ఆయనకు వివరించారు. ఆ–హబ్, కంప్యూటర్ సైన్స్ విభాగం సమీపంలో ఆల్గారిథం ఫార్మసీ ల్యాబ్ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన ఎలిమెంట్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, గోపాలస్వామి ఎంపీ థియేటర్, పోలమాంబ ఆలయ సమీపంలో ఇంజినీరింగ్ విద్యార్థుల రూసా హాస్టల్, శివాజీపాలెంలో ఇంటర్నేషనల్ హాస్టల్‌ను టీటీడీ చైర్మన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏయూను ఆధునికీకరిస్తున్న వీసీని అభినందించారు. రెక్టార్ ఆచార్య కె.సమత, టి.షారోన్‌రాజు, ఆచార్య పి.అర్జున్, డాక్టర్.జి.రవికుమార్, బి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో ఆలయం ఆధునికీకరణ

ఏయూలోని శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని వైవీ సుబ్బారెడ్డి సందర్శించారు. ఆలయ ఆధునికీకరణకు రూ.50 లక్షలు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంతో చరిత్ర గల ఈ ఆలయాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డిని కోరారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

గొలుగొండ పోలీస్‌స్టేషన్‌లో విధుల నిర్వహణ


గాయపడిన దేవుడుబాబును ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు


దేవుడుబాబు(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గవిరెడ్డి దేవుడుబాబు(47) మృతి చెందారు. ఈ ఘటనపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న దేవుడుబాబు తమ్ముడు అప్పలనాయుడు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా కోర్టులో వారెంట్లు, సమన్లు తదితర విధులు నిర్వర్తించే దేవుడుబాబు శుక్రవారం ఉదయం కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో తన ఇంటి నుంచి కోర్టుకు బయలు దేరారు. అదే సమయంలో తనకు వరసకు సోదరుడైన సింగంపల్లి అప్పలనాయుడు కూడా కారులో విశాఖ వస్తున్నందున.. అతనితో పాటు పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వస్తున్నారు. దుక్కవానిపాలెం టోల్‌గేట్ వద్ద వాటర్‌బాటిల్ కొనుగోలుకు అతను కారు నుంచి కిందకు దిగారు. తిరిగి కారు ఎక్కే సమయంలో వెనుక నుంచి మినీ లగేజీ వాహనం కారుతో పాటు దేవుడుబాబును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కింద పడిన హెడ్ కానిస్టేబుల్ తలకు బలమైన గాయమై కుడిచేయి విరిగిపోయింది. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి అతన్ని తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాభిపై యాదవ సంఘం ఫిర్యాదు


సీఐకి ఫిర్యాదు చేస్తున్న యాదవ సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు: తెలుగుదేశం అధికార ప్రతినిధి పట్టాభిపై విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు యాదవ్‌పై ఓ టీవీ చానల్‌లో ఏకవచనంతో మాట్లాడటంతో పాటు అసభ్యకరమైన పదజాలంతో దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదవ జాతి గౌరవానికి భంగం కలిగించినందుకు పట్టాభిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి మొల్లి అప్పారావు, యువత విభాగం అధ్యక్షుడు పల్లా దుర్గారావు, సలహాదారులు గుంప అప్పారావు, హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ప్లస్–2 ఫలితాల్లో శ్రీచైతన్య ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో విద్యా సంస్థల ప్రతినిధులు

విశాఖ విద్య: సీబీఎస్ఈ ప్లస్–2 ఫలితాల్లో విశాఖపట్నం శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో విద్యా సంస్థలకు చెందిన ఎ.ఐశ్వర్య 488, ఆరుషి పాడి 485, కె.తేజస్వి 483, వి.రేష్మిత 481, సీహెచ్. సాయి వైష్ణవి 481, కె.అనీష 480, కె.హరిప్రియ 480, వి.సాయి ప్రశాంతి 480 మార్కులు సాధించారు. విద్యా సంస్థలకు చెందిన 8 మంది విద్యార్థులు 470 మార్కులు పైగా, 36 మంది 450 మార్కులు పైగా, 120 మంది విద్యార్థులు 433 మార్కులకు పైగా సాధించినట్లు విద్యా సంస్థల ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇందుకు కృషి చేసిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను అభినందించి, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ చక్కటి ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. డీన్స్ రఘు కుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో శ్రీచైతన్య సత్తా


విద్యార్థిని అభినందనిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రతినిధులు

విశాఖ విద్య: సీబీఎస్‌సీ 10వ తరగతి ఫలితాల్లో విశాఖపట్నం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. జ్వాలిత కాండ్రేగుల 491 మార్కులు, వైష్ణవి సిన్హా 488, అవంతిక సింగ్ 487, లక్ష్మి యువరాజ్ బొమ్మిడి 485, మోక్ష రాజాగిరి 485, ప్రజిత దాస్ 485 మార్కులు సాధించినట్లు విద్యా సంస్థల ఏజీఎం ఎం.వి.సురేష్ తెలిపారు. విద్యా సంస్థలకు చెందిన 17 మంది విద్యార్థులు 480కు పైగా, 49 మంది 470(94శాతం)మార్కులకు పైగా, 91 మంది విద్యార్థులు 450 మార్కులకు పైగా సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు అభినందించారు. అధ్యాపకుల సమష్టి కృషి ఫలితంగానే అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని అకడమిక్ డైరెక్టర్ సీమ అన్నారు. రీజినల్ ఇన్‌చార్జ్ ఆలీ, ఆశిబాబు, రమణ, ప్రసాద్, అకడమిక్ కో–ఆర్డినేటర్ రాజేష్, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

16 నుంచి విజ్ఞాన్‌లో అంతర్జాతీయ సదస్సు


అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్ రత్తయ్య

అగనంపూడి: విజ్ఞాన్ కళాశాల సారథ్యంలో ఆటోమేషన్, కంప్యూటేషన్ మెటీరియల్స్ ఇంజినీరింగ్(ఏసీఎంఈ) అంశంపై ఈ నెల 16 నుంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య తెలిపారు. సదస్సును బ్రోచర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు వారి సృజనాత్మకతకు వెలికితీసేందుకు చక్కని వేదికన్నారు. ఇక్కడ ఎంపికైన నమూనాలు ఏబీపీలో ప్రచురిస్తామన్నారు. రెక్టార్ వి.మధుసూదనరావు, సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ పి.వి.రవీంద్ర, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బి.ప్రసాద్, సదస్సు కన్వీనర్ ఇ.ఎల్.లిడియా పాల్గొన్నారు.